క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

నందవరం: గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని గ్రామ ఉపసర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్ అన్నారు. సోమవారం నందవరంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీడీఓ కిరణమోహన్ రావు, పీఆర్ ఏఈ జయన్న ఆధ్వర్యంలో మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేశప్పగౌడ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధుల ద్వారా సీసీ రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి వీరభద్ర స్వామి ఆలయం కార్నర్ వరకు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చాంద్‌తాత, నాగరాజు, దత్తాత్రేయగౌడ్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో పదో తరగతి హాల్‌టికెట్లు

తుగ్గలి: ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థుల హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఎంఈఓ–2 రామవెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల లాగిన్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థులకు అందజేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా స్ట్రీమ్, పాఠశాల పేరు, విద్యార్థి పేరు, పుట్టిన తేదీని సబ్మిట్ చేసి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

రెన్యూవల్ చేసుకోండి

తుగ్గలి: మండలంలోని ఉప్పర్లపల్లి, మారెళ్ల సహకార బ్యాంకుల్లో తీసుకున్న దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలకు రైతులు సకాలంలో వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాలని ఆయా సంఘాల అధ్యక్షులు మాదిరెడ్డి విజయలక్ష్మి, అట్ల గోపాల్‌రెడ్డి కోరారు. సోమవారం వారు స్థానికంగా మాట్లాడుతూ.. సకాలంలో రెన్యూవల్ చేసుకున్న రైతులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు వర్తిస్తాయని తెలిపారు. ఈనెలాఖరులోపు రైతులందరూ వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలన్నారు. .

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పార్వతమ్మకు పింఛన్ అందిస్తున్న జయరాం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పార్వతమ్మ అనారోగ్యానికి గురై కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. గ్రామ వలంటీర్ జయరాం తన టెట్ పరీక్ష తిరుపతిలో రాసి వచ్చి పార్వతమ్మ ఆరోగ్య విషయం తెలుసుకుని కర్నూలుకు వెళ్లి రూ.3 వేల వృద్ధాప్య పింఛన్ అందించాడు. వృద్ధురాలి కుటుంబ సభ్యులందరూ అక్కడే ఉండడంతో ఆమె ఆరోగ్యానికి భరోసా ఇచ్చేలా ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త ఆరోగ్యశ్రీ కార్డును అందించాడు. వలంటీర్ సేవల పట్ల లబ్ధిదారురాలు, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పైపులైన్ పనులు ఆపాలి

మద్దికెర: రైతుల పొలాలలో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న పైపులైను పనులు వెంటనే ఆపాలని సీపీఎం మండల కార్యదర్శి రవి, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు కోరారు. సోమవారం పైప్‌లైను పనుల వద్ద వారు నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ.. తుగ్గలి మండలంలోని మైసూర్ ప్రైవేట్ గోల్డ్ మైన్స్ పరిశ్రమకు నీటిని తరలించేందుకు పైపులైను వేస్తున్నారన్నారు. రైతులకు సమాచారం ఇవ్వకుండా పనులు చేపట్టరాదని, వెంటనే పనులు నిలిపివేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫుడ్ ప్రాసెస్ యూనిట్‌ను తరలించాలి

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దనేలటూర్ గ్రామంలో ఫుడ్ ప్రాసెస్ యూనిట్‌ను ఇళ్ల మధ్య ఏర్పాటు చేయడంతో దుర్వాసన వెదజల్లుతోందని, యూనిట్‌ను మరోచోటికి తరలించాలని గ్రామస్తులు సుభాన్, చిన్న నరసింహుడు, శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి నరసమ్మకు వినతిపత్రం అందజేశారు.

క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న జడ్పీటీసీ, మండల సచివాలయ కన్వీనర్

మద్దికెర: బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ కవిదాసు సూచించారు. సోమవారం బసినేపల్లి గ్రామంలో 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసిచూపిన ఘనత వైఎస్సార్‌సీపీదే

- జగనన్నతోనే రాష్ట్రానికి భవిష్యత్తు
- మంచి జరిగి ఉంటేనే మాకు ఓటు వెయ్యండి
- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



పులికొండ గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండ రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంతో గ్రామాల్లో అభివృద్ధి సాధ్యపడిందని, మళ్లీ జగనన్నను గెలిపించుకుంటే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పులికొండ, దూదేకొండ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా పులికొండలో సర్పంచు అనసూయమ్మ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. శ్రీరంగనాథ స్వామిని దర్శించుకున్న అనంతరం రూ.38 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.26 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.21 లక్షలతో పూర్తిచేసిన హెల్త్ క్లినిక్, రూ.45 లక్షలతో వేసిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అక్కడి నుంచి దూదేకొండకు చేరుకున్న ఎమ్మెల్యేకు సర్పంచు రహిమాన్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో రూ.48 లక్షలతో నిర్మించిన సచివాలయ నూతన భవనం, రూ.24 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, ఇంటింటికీ తాగునీరు అందించేందుకు రూ.36 లక్షలతో పూర్తిచేసిన జలకళ తాగునీటి పథకాన్ని, రూ.45 లక్షలతో గ్రామ శివారులో దుర్గమ్మ ఆలయం వరకు వేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ ప్రజాప్రభుత్వంలో అభివృద్ధి చేసి చూపించామన్నారు. ఎన్నికలొస్తున్నాయని ప్రజలకు ఎరవేసేందుకు టీడీపీ–జనసేన ప్రయత్నిస్తున్నాయని, వారి ప్రలోభాలకు లొంగిపోయి మోసపోవద్దన్నారు. పొరపాటు జరిగితే మరో ఐదేళ్లు అంధకారంలోకి వెళ్లినట్లే అన్నారు. ఎంపీపీ నారాయణదాస్, వైస్ ఎంపీపీ బలరాముడు, ఎంపీడీఓ రామారావు, దూదేకొండ ఉప సర్పంచు ఉచ్చీరప్ప, నాయకులు తిప్పయ్య, హెచ్.రంగన్న, బాలు, ఏఈలు వెంకటేశ్వర్లు, వెంకట్రాముడు, వీఆర్‌ఓ సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల ప్రక్రియ వేగవంతం చేయండి

చిప్పగిరి: వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని చిప్పగిరి ఏపీయూడబ్ల్యూజే సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ పద్మజకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ అభ్యర్థనపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఆస్పరి: వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి జన్మదినం సందర్భంగా ఆస్పరి యూత్ ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు అమీలియో ఆస్పత్రి వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన తనయుడు చంద్రశేఖర్ ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. వైద్య శిబిరంలో డాక్టర్లు ప్రసన్న, అస్మా 140 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, నాయకులు మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, బసవరాజు, తదితరులు శిబిరాన్ని పర్యవేక్షించారు.

హొళగుంద: వైఎస్సార్‌సీపీ నాయకుడు విరూపాక్షి జన్మదినం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రామంజి, మల్లయ్య, మల్లికార్జున తదితరులు గర్భిణులు, బాలింతలు, రోగులతో పాటు గ్రామంలోని అనాథలకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న బుట్టారేణుక

ఎమ్మిగనూరుటౌన్: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగనన్న పాలన సాగిస్తున్నారని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి వారి కుటుంబాలకు తోడుగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక పేర్కొన్నారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం స్థానిక కుర్ని కళ్యాణ మండపంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, రాష్ట్ర కుర్ణికరికల కార్పొరేషన్ చైర్మన్ బుట్టాశారదమ్మ, శాప్ నెట్‌వర్క్ చైర్మన్ మాచాని వెంకటేష్, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్‌లతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరికీ సొంతిల్లు ఉండాలన్న సంకల్పంతో అందరికీ ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలు చేసి వాటిని రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వడం దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల సిఫారసులతోనే అరకొర సంక్షేమ పథకాలు ఆ పార్టీ వారికి మాత్రమే అందేవని ఎద్దేవా చేశారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకునేందుకుగా మహిళలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, షాబుద్దీన్ ప్రసంగించగా బుట్టానీలకంఠ, బుట్టా ప్రత్యూల్, కౌన్సిలర్లు ఇషాక్, పూజేశ్వరి, రామాంజినమ్మ, సంధ్య, అంపమ్మ, కేశవరెడ్డి, శివప్రసాద్, సుధాకర్, సూరి, గట్టుభాజా, మురహరిరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



అరికెరలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న సమన్వయకర్త విరూపాక్షి

ఆలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని అరికెర గ్రామ సచివాలయాలన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థతో నిజమైన గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు పరిచయం చేశారని కొనియాడారు. ప్రజలు మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని, అప్పుడే సంక్షేమ ఫలాలు ప్రజలకు నిరంతరాయంగా అందుతాయన్నారు. నాయకులు చంద్రశేఖర్, ఈరన్న, షేక్షావలి, వెంకటేశులు, వీరేష్, ఉరుకుందు, గోవిందప్ప, ధనుంజయ తదితరులు ఉన్నారు.

హొళగుంద: మండలంలోని కోగిలతోట, మార్లమడికి, నాగరకణ్వీ, హొన్నూరు, హొన్నూరు కొట్టాల గ్రామాలలో సమన్వయకర్త విరూపాక్షి పర్యటించి ప్రజలతో మమేకమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరి సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమన్నారు. సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు షఫివుల్లా, శేషప్ప, ఈశా, నాగప్ప, రమేశ్, మోహన్‌రాజు తదితరులు ఉన్నారు.

సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతులు

ఆస్పరి: ఆదోని రోడ్డు నుంచి మండలంలోని తంగరడోణ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉండడంతో వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరుపాక్షి సొంతంగా రూ.80 వేల ఖర్చుతో 95 ట్రాక్టర్ల గరుసు వేయించి చదును చేయించారు. గ్రామస్తుల విన్నపం మేరకు తాత్కాలికంగా గరుసు వేయించి బాగు చేయించినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితుల అరెస్ట్‌ను చూపుతున్న ఎస్‌ఐ నరేంద్ర

హాలహర్వి: మండలంలో నిర్వహించిన ఆకస్మిక దాడులలో ఏపీ 21 బీడీ 4256 నంబర్ గల ద్విచక్ర వాహనంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న విరుపాపురం గ్రామానికి చెందిన బిపి కాళింగను మండలంలోని కోగిలతోట క్రాస్ వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. నిందితుడి వద్ద నుండి 384 హైవార్డ్ విస్కీ 90 ఎంఎల్ మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. తనిఖీల్లో విజయ్, రంఘస్వామి, అయ్యప్పస్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని నాగులదిన్నె పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. గోనెగండ్ల మండలం అల్వాల గ్రామానికి చెందిన మాదిగ లక్ష్మన్న కర్ణాటక మద్యం తరలిస్తుడంగా పట్టుకుని 288 జాన్స్ ఒరిజినల్ చాయిస్ విస్కీ (90 ఎంఎల్) మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

హొళగుంద: పెద్దగోనెహాళ్ గ్రామంలో కర్ణాటక మద్యం విక్రేతను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు సోమవారం తెలిపారు. సదరు వ్యక్తి కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం టెట్రా ప్యాకెట్లను తీసుకొచ్చి గ్రామంలో విక్రయించేందుకు వాముదొడ్డిలో దాచి ఉంచినట్లు చెప్పారు. దాడులు నిర్వహించి నిందితుడి నుంచి 288 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

హొళగుంద: మద్దిలింగదహళ్లి గ్రామంలో వెలిసిన లక్ష్మమ్మ ఆలయ నిర్మాణానికి ఆదోనికి చెందిన వ్యాపారవేత్త మోహన్‌ప్రసాద్ సోమవారం రూ.15 వేలు విరాళం అందించారు. దేవి ఆలయం చిన్నగా ఉండి శిథిలావస్థకు చేరుతుండడంతో గ్రామపెద్దలు నూతన ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. ఈ మేరకు గ్రామపెద్దలు రంగస్వామి, మదినా, మల్లారెడ్డిలకు దాత నగదును అందజేశారు. వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

డీటీ బాధ్యతల స్వీకరణ

తుగ్గలి: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా నాగరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన డీటీ నిజాముద్దీన్ కొత్తాళం మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో మద్దికెరలో పనిచేస్తున్న డీటీ నాగరాజు ఇక్కడ నియమితులయ్యారు.

విద్యుత్ మోటార్ చోరీ

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని ఆటికెలగుండు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యుత్ మోటార్ చోరీకి గురైందని పాఠశాల హెచ్‌ఎం సుబ్రమణ్యం సోమవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అలాగే నాడు–నేడు పనుల్లో భాగంగా పాఠశాల ఆవరణలో ఉంచిన ఇటుకులను ఎత్తుకెళ్లినట్లుగా హెచ్‌ఎం ఫిర్యాదులో పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



అమకతాడులో సిద్ధం సామగ్రిని బూత్ కమిటీ సభ్యులకు అందజేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని టి.గోకులపాడు, అమకతాడు, తొగర్చేడు, ఎస్‌హెచ్ ఎర్రగుడి, కృష్ణగిరి గ్రామ సచివాలయాల్లో సోమవారం ఆయన ఆయా గ్రామాల బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలు, వైఎస్సార్‌సీపీ పాలనలో అందించిన పథకాలను వివరించి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. అనంతరం సిద్ధం సామగ్రిని అందజేశారు. ఆయా గ్రామాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ జాబితా ప్రదర్శన

చిప్పగిరి: మండలంలో ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతుల వివరాలను ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాలలో సోమవారం ప్రదర్శించినట్లు ఏఓ విజయలక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ఈ–క్రాప్ నమోదు వివరాలను రైతులు సరిచూసుకోవాలన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే తమ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. ఈ క్రాప్‌తో పాటు ఈ–కేవైసీ నమోదు చేసుకున్న రైతుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు.

సద్వినియోగం చేసుకోండి

చిప్పగిరి: స్పందన కార్యక్రమానికి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు పద్మజ సూచించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను పరిశీలించి తగిన పరిష్కారం చూపుతుమాని ఆమె పేర్కొన్నారు. ఎంపీడీఓ బరెన్‌సాహెబ్, ఎంఈఓ బాలనాయుడు, ఏఓ విజయ లక్ష్మి, ఈఓపీఆర్డీ బాలన్న, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణానికి చెందిన శ్రీనివాసరావు, ఇతని కుమార్తె దుర్గ సోమవారం స్థానిక లైబ్రరీకి పలు పుస్తకాలను విరాళంగా అందించారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు అవసరమయ్యే పుస్తకాలను గ్రంథాలయానికి అందించినట్లు లైబ్రేరియన్ కవితాబాయి చెప్పారు. యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ



కర్నూలు ఆస్పత్రిలో బడేసాబ్‌కు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ వడ్ల సునంద

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లికి చెందిన బడేసాబ్, రాఘవేంద్ర కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో గ్రామ వలంటీర్ వడ్ల సునంద సోమవారం ఆస్పత్రికే వెళ్లి పింఛన్ పంపిణీ చేసి ప్రశంసలు అందుకుంది. బడేసాబ్ కొద్ది రోజుల నుంచి పక్షవాతంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన బెస్త రాఘవేంద్ర అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఇటీవల కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పి చికిత్స అందిస్తున్నారు. వారిద్దని ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న వలంటీర్ సునంద సోమవారం కర్నూలులో ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి బడేసాబ్‌కు వృద్ధాప్య పింఛన్ రూ.3 వేలు, రాఘవేంద్రకు మత్స్యకార పింఛన్ రూ.3 వేలు అందజేసింది. ఆస్పత్రికి వచ్చి పింఛన్ అందించడంపై లబ్ధిదారులు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'ఆరోగ్య శ్రీ' కార్డులను పంపిణీ చేయండి



నందవరంలోని సచివాలయం–1లో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 'ఆరోగ్య శ్రీ' కార్డులను లబ్ధిదారులకు వేగవంతంగా పంపిణీ చేయాలని ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు ఆదేశించారు. ఆయన సోమవారం మండల కేంద్రంలోని సచివాలయం–1,–2,–3లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వలంటీర్ల ద్వారా ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలతో డాష్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమయపాలన పాటిస్తూ గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. సచివాలయ కార్యదర్శి ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న ఏపీడీ జి.అల్లీపీరన్

ఎమ్మిగనూరురూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ జి.అల్లీపీరన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై ఈసీ, టీఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి ప్రారంభం కావడంతో గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. వ్యవసాయ కూలీలు వలస వెళ్లకుండా ఉన్న ఊర్లో ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫారం పాండ్స్, మినీ అమృతసర్, డకౌట్స్, పండ్ల తోటల పెంపకం వంటివి చేపడుతున్నామన్నారు. పండ్ల తోటల సాగు చేపట్టేలా ప్రతి గ్రామంలో రైతులను ప్రోత్సహిస్తున్నామని, వంద శాతం సబ్సిడీ ఇస్తామని తెలిపారు. ఏపీఓ విజయమోహన్, క్లస్టర్ టీఏ బషీర్, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

శివస్వాముల సాక్షిగా ఒక్కటైన జంటలు



ఆలయంలోకి వెళుతున్న నూతన జంటలు

హొళగుంద: మండల పరిధిలోని కోగిలతోట గ్రామంలో సోమవారం సామూహిక వివాహాల కార్యక్రమం వైభవంగా జరిగింది. శివదీక్ష తీసుకున్న స్వాములు, గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరు నూతన జంటలు ఒక్కటయ్యాయి. వధువరుల బంధువులు, కుటుంబ సభ్యులతో పాటు గ్రామపెద్దలు, ప్రముఖులు, హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమానికి హాజరైన వారికి భోజన సౌకర్యం కల్పించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విరూపాక్షి వధూవరులను ఆశీర్వదించారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

హాలహర్వి: మండలంలోని బిలేహాల్, నిట్రవటి, హర్దగేరి తదితర గ్రామాల్లో విద్యుత్ లైన్లకు మరమ్మతు పనులు చేపట్టినట్లు ఏఈ జంబన్న తెలిపారు. సోమవారం మండలంలోని ఆయాగ్రామాల్లో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్న చోట కొత్తవి ఏర్పాటు చేస్తునట్లు చెప్పారు. మండలంలో విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఆలూరు: గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని ఎస్‌ఎస్ ట్యాంకుల నుంచి నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నామని ఆలూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య తెలిపారు. హాలహర్వి, హొళగుంద, చిప్పగిరి మండలాల్లోని ఎస్‌ఎస్ ట్యాంకులలోకి ఎల్లెల్సీ నుంచి నీటి పంపింగ్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బాపురం రిజర్వాయర్‌లో 12 అడుగులు, చింతకుంట – 10, హొళగుంద – 11, విరుపాపురం రిజర్వాయర్‌లో 12 అడుగుల మేర నీటిని నిల్వ చేస్తున్నామన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

రోడ్ల ఆక్రమణలు అరికట్టాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్

తుగ్గలి: పంచాయతీ, ఆర్‌అండ్‌బీ రోడ్లు ఆక్రమణకు గురికాకుండా చూడాలని జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ ఆదెమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాలు పొందిన వారు వెంటనే ఈ–కేవైసీ చేయించుకునేలా చూడాలని తహసీల్దార్ షర్మిల ప్రజాప్రతినిధులకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ.. మండలంలో చాలా చోట్ల పంచాయతీ, ఆర్‌అండ్‌బీ రోడ్లు ఆక్రమణకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున అభివృద్ధి పనులు పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు కృషి చేయాలని కోరారు. అనంతరం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు మల్లికార్జునరెడ్డి, ఎర్ర నాగప్ప, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించుకుందాం



సోమలగూడూరులో సిద్ధం పోస్టర్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందవరం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నాగరాజు, మండల జేసీఎస్ కన్వీనర్ చాంద్‌బాషా పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని గురజాల, రాయచోటి, సోమలగూడూరు గ్రామాలలో 'మేము సిద్ధం.. నా బూత్ సిద్ధం' కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన జరగాలంటే, పేదింటి బిడ్డల భవిష్యత్తు బాగుడాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. గత చంద్రబాబు పాలన, ప్రస్తుత జగనన్న పాలనలో తేడాను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేయాలని సూచించారు. ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, పరమేశ్, నరసింహులు, రామచంద్ర, రాఘవేంద్రరెడ్డి, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం



టి.సోమలగూడూరు సేవా పురస్కారాలు అందుకున్న వలంటీర్లు

నందవరం: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను పేదల దరిచేర్చడంలో వలంటీర్ల సేవలు అమోఘమని వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని సోమలగూడూరులో 24 మంది గ్రామ వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాల ప్రదానంతో పాటు మెడల్, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న నిస్వార్థ సేవలను గుర్తించి ప్రభుత్వం సేవా అవార్డులతో ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. పంచాయతీ కార్యదర్శి నౌసన్న, వీఆర్వో రాజు, వెల్ఫేర్ అసిస్టెంటు శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.